క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నూజివీడు: స్పందన కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీ శంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి డివిజన్‌లోని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించి గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలను అందజేయాలని ఆర్డీఓ కోరారు.

రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్



ఇబ్రహీంపట్నం: పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సీఐ ఎం.సత్యనారాయణ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. లా అండ్ ఆర్డర్‌కు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కేసులు పెడతామని హెచ్చరించారు. మద్యం అక్రమ రవాణా, జూదం, కోడి పందేలు, శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

1,200 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరులో ఆదివారం మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీ సెంటర్లోని నాగార్జున స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యులు తాళ్లూరి రామకోటేశ్వరరావు, రాజేశ్వరి, లక్ష్మణరావు, నరేంద్ర, భవాని 1200 మందికి రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రతి రోజూ వ్యాయామం చేయడం, నడవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరంగా జీవించవచ్చని సూచించారు. జేవీవీ జిల్లా కన్వీనర్ డాక్టర్ రవీంద్ర, స్థానిక ప్రతినిధులు హరికృష్ణ, పాపారావు, సుబానీ, రాంప్రదీప్ తదితరులు పర్యవేక్షించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలందించారు.

యూనియన్ సదస్సుకు హాజరైన ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నాగపూర్‌లో ఈనెల 17, 18 తేదీల్లో జరిగిన ఇండిపెండెంట్ లేబర్ యూనియన్ జాతీయ సదస్సుకు హాజరయ్యారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ కిరణ్ తెలిపారు. రెండు రోజుల సదస్సులో జరిగిన ముఖ్యాంశాలను ఆదివారం ఆయన వివరించారు. ప్రముఖ అభ్యుదయ కవి కంచె ఐలయ్య ఎస్సీ, ఎస్టీ ట్రేడ్ యూనియన్‌ల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్రపై ప్రసంగించారని చెప్పారు. రాష్ట్ర కన్వీనర్ బి.కాంతారావు, సోమశేఖర్, జయశంకర్‌రాయ్, కల్యాణ్‌కుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

చాట్రాయి: ఎటువంటి ఆసరాకు నోచుకోలేని వృద్ధులకు నీడ కల్పించేందుకు వృద్ధాశ్రమాలు దోహదపడతాయని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బూరుగుగూడెంలో తన తండ్రి చిన్నం సుబ్బారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వృద్ధులకు మాత్రమే ఈ ఆశ్రయంలో ప్రవేశం ఉంటుందని, కుల, మతాలకు అతీతంగా ఈ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

సహకార రంగం బలోపేతం

- అన్నదాతలకు మెరుగైన సేవలు
- రూ.7.43 కోట్లతో సొసైటీల అభివృద్ధి
- శిథిల భవనాలు తొలగించి నూతన నిర్మాణాలు
- అందుబాటులో ఆధునిక వసతులు
- వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు



నూజివీడు మండలం తుక్కులూరులో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనం

నూజివీడు: రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ రంగానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అదే స్థాయిలో సహకార రంగాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేస్తోంది. దీనిలో భాగంగా వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలను అందించడమే కాకుండా అన్ని సహకార సంఘాలను అభివృద్ధి చేస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించడమే కాకుండా సహకార సంఘాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నారు. శిథిలమైన భవనాలను ఆధునీకరిస్తున్నారు. వీటికి తోడు సహకార కేంద్ర బ్యాంకులను ఆధునీకరించడంతో వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలందిస్తున్నాయి.

నూజివీడు నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని కేడీసీసీబీ బ్రాంచిలకు నూతన భవనాలను, ఆధునీకరణ పనులను, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)లకు నూతన భవనాల నిర్మాణం, ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు చొరవతో చేపట్టారు. నూజివీడు, చాట్రాయి, ఆగిరిపల్లిలలోని కేడీసీసీబీ భవనాలను రూ.1.36 కోట్లతో ఆధునీకరించారు. చాట్రాయిలో రూ.కోటితో నూతన భవనాన్ని నిర్మించారు. ఆగిరిపల్లిలో రూ.16.75 లక్షలతో ఏటీఎం ఏర్పాటు, ఆధునీకరణ పనులు పూర్తి చేశారు. నూజివీడులో రూ.20.50 లక్షలతో ఆధునీకరణ పనులు చేశారు. రూ.6.08 కోట్లతో నియోజకవర్గంలోని పలు సొసైటీలకు నూతన భవనాలను నిర్మించడం, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయడం, గోడౌన్లను నిర్మించి రైతులకు మెరుగైన సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు. చాట్రాయి మండలంలోని చిన్నంపేట, తుమ్మగూడెం, పోలవరంలో ఒక్కొక్కటి రూ.కోటి వ్యయంతో పెట్రోలు బంకులను ఏర్పాటు చేశారు. నూజివీడు మండలం తుక్కులూరులో రూ.43 లక్షలతో నూతన సొసైటీ భవనాన్ని నిర్మించి దీనిలో క్యాష్ కౌంటర్, లాకర్‌ను ఏర్పాటు చేశారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో సొసైటీకి నూతన కార్యాలయాన్ని, నూతన గోడౌన్‌ను రూ.40.50 లక్షలతో నిర్మించారు. నియోజకవర్గంలో ఈదులగూడెం, తుమ్మగూడెం, పోలవరం, చిన్నంపేట, చనుబండ, రమణక్కపేట, చెక్కపల్లి, గోపవరం, కాట్రేనిపాడులలోని సొసైటీలకు నూతన భవనాలను నిర్మించడంతోపాటు ఆధునీకరణ పనులు పూర్తి చేశారు. నూతన భవనాలను నిర్మించిన సొసైటీల్లో క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, లాకర్లు ఏర్పాటు చేయడంతో పాటు గోల్డ్‌లోన్ సౌకర్యాన్ని కల్పించి సంఘాల వ్యాపార అభివృద్ధికి తోడ్పాటును అందించారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారమవడంతో సహకార సంఘాల అధ్యక్షులతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతాంగానికి గోడౌన్ల సదుపాయం

గత ప్రభుత్వం చేయలేని విధంగా రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ గోడౌన్లను అడవినెక్కలం, ఈదులగూడెం, చిన్నంపేట, చనుబండ, రమణక్కపేట సొసైటీల వద్ద నిర్మించారు. దీనివల్ల వర్షాల సమయంలో, తుపానుల సమయంలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఈ గోడౌన్లు దోహదపడను న్నాయి. సొసైటీల ద్వారా ఎరువులను విక్రయించేందుకు సైతం గోడౌన్లు ఉపయోగపడతాయి. పోలవరం, తుమ్మగూడెంలో సమావేశ మందిరాలను నిర్మించారు. ఈ విధంగా అన్నిరకాల సదుపాయాలు రెండేళ్లుగా అందుబాటులోకి రావడంతో ఇవి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. గతంలో లేనివిధంగా నేడు ఎకరాకు రూ.8 లక్షల వరకు సొసైటీల్లో రుణాలను ఇస్తున్నాం. రైతులకు క్యాష్ కౌంటర్లు, లాకర్లను అందుబాటులోకి తీసుకువచ్చాం. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అర్హత ఉన్న రైతులందరికీ అందిస్తున్నాం.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్యే, నూజివీడు

అగ్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ముసునూరు: ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆర్థిక సహాయం అందజేశారు. గుళ్లపూడికి చెందిన పల్లి నాగేశ్వరరావు కుటుంబం అగ్ని ప్రమాదంలో నివాసగృహం దగ్ధమవడంతో వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, ఎంపీపీ కొండా దుర్గాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు లింగారావు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ ఆర్.శ్రీదేవి, ఉప సర్పంచ్ వి.పద్మజ పార్టీ నేతలు ఆర్. శ్రీనివాస్, రాంబాబు, ధర్మరాజు పాల్గొన్నారు.

రాముకి పలువురి అభినందన

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమితులైన మండలంలోని వేమిరెడ్డిపల్లి తండాకు చెందిన భూక్య రామును పలువురు అభినందించారు. ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

ఎ.కొండూరు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం స్థానిక మ్యాంగో మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రూ. రెండు లక్షల 60 వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. టీడీపీ నేతలు తాగునీటి కోసం పాదయాత్రలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు టీడీపీ నేతలు మానుకోవాలని హితవు పలికారు. ఈ మండల ప్రజలకు కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో ప్రతి రోజూ కృష్ణా జలాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలు 100 శాతం అమలుచేసిన రాజకీయ పార్టీ వైఎస్సార్ సీపీ అని చెప్పారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చామని చెప్పారు. తిరువూరులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నల్లగట్ల సుధారాణి, నాయకులు కె. పుల్లారావు, డి. సతీష్, కె. చెన్నారావు, టి. వెంకటేశ్వరరెడ్డి, అమీన్, ఎ. వెంకటరెడ్డి, టి. సురేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సాహిత్య, సంగీత స్రష్ట రామరాజ భూషణుడు

ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సాహిత్యంలోనే కాకుండా సంగీతంలోనూ ప్రావీణ్యం గల రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) సాహిత్య, సంగీత స్రష్ట అని విజయవాడ సెంట్రల్, పశ్చిమ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శ్రీరామరాజ భూషణ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ 40వ వార్షికోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో నిర్మించిన రామరాజ భూషణుని విగ్రహాన్ని ఆదివారం ఏపీ భట్టరాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి ఆవిష్కరించారు. అనంతరం కళాక్షేత్రం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లాది, వెలంపల్లి పాల్గొని మాట్లాడారు. భట్టరాజు సామాజికవర్గానికి చెందిన మెరిట్, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తూ ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ కూరపాటి కోటంరాజు అభినందనీయులన్నారు. అదే విధంగా సంఘసేవకులు, సాహితీవేత్తలు, కళాకారులు, విద్యావేత్తలను గౌరవించి సత్కరించటంతో పాటు పారితోషకాలు ప్రదానం చేస్తూ సమాజంలో మంచి విద్య, సాంస్కృతిక, సేవ ట్రస్ట్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. సినీ గేయ రచయిత రసరాజు మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన అష్టదిగ్గజ కవుల్లో ప్రత్యేక పాత్రను పోషించటంతోపాటు వసుచరిత్ర, సరస భూపాలీయం, హరిశ్చంద్ర నలోపాఖ్యానం వంటి సత్ గ్రంథాలను రచించిన రామరాజు భూషణుడు చిరస్మరణీయుడన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రామరాజ భూషణునిగా ప్రసిద్ధి చెందిన భట్టుమూర్తి శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయల ఆస్థానానికి ఆభరణం మాదిరిగా ఉండటం వలన ఆయనకు రామరాజ భూషణుడిగా పేరు వచ్చిందని గుర్తు చేశారు. ఆయన 16వ శతాబ్దానికి చెందిన తెలుగు కవి, సంగీత విద్వాంసుడన్నారు.

స్కాలర్‌షిప్‌ల అందజేత..

కార్యక్రమ నిర్వాహకులు, శ్రీరామరాజ భూషణ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఏపీ భట్టరాజు సంఘం అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులకు చక్కటి విద్యను బోధించటంతో పాటు ప్రతిభ కలిగిన, పేద విద్యార్థులకు ఇప్పటి వరకు సుమారు రూ.30 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ పి.జయప్రకాష్ రాజు, ఏపీ భట్టరాజు సంఘం మహిళా అధ్యక్షురాలు లోలభట్టు అనసూయ దేవి, జనరల్ సెక్రటరీ భట్టు మనోహర కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, యువజన సంఘం అధ్యక్షుడు కాసుల రాజా శ్రీధర్ రాజు, ఎల్.శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై వ్యాఘ్ర లక్ష్మీ నరసింహుడి దర్శనం



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహస్వామి మాఘమాసం రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు నాగిరెడ్డి పాపా అప్పారావు దంపతులు శాంతి కల్యాణం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ వైభవంగా నిర్వహించారు.

ముస్లింల ఆత్మీయ సమావేశం

మైలవరం: ముస్లింలు అందరూ ఐక్యంగా ఉండి అభివృద్ధిపథంలో ముందుకు సాగాలని మైలవరం గ్రామ ముస్లిం మత పెద్దలు ఖాజాభాయ్, మైలవరం కో-ఆప్షన్ సభ్యులు సుభానీ అన్నారు. మైలవరం విజయవాడ రోడ్డులోని ఏఎంసీ పక్కన ఖాళీ ప్రాంగణంలో నియోజకవర్గ ముస్లింల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో మత పెద్దలు మాట్లాడుతూ స్థానిక మదర్సాలో చదువుకుంటున్న విద్యార్థులకు వనరులు చేకూర్చాలని తెలిపారు. ఈ సందర్భంగా మైలవరం వైస్ ఎంపీపీ షేక్ అబ్దుల్ రహీం భాయ్‌ని శాలువాతో ఘనంగా సత్కరించారు. రహీం చేసిన సేవలను కొనియాడారు. ముస్లింలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారికి తోడుగా అందరూ ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు హైమవలి, మత పెద్దలు కాజాభాయ్, ఇబ్రహీం భాయ్, డాక్టర్ అమీర్ హంజభాయ్, మత గురువులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు

ముసునూరు: సర్పంచ్ చొరవ చూపి రహదారికి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి సమస్య పరిష్కరించడంతో గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు. మండలంలోని వేల్పుచర్ల దళితవాడలో డొంక దారిని సీసీ రహదారిగా అభివృద్ధి చేశారు. డొంకగా ఉన్నప్పుడు ఒక పక్కగా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు అభివృద్ధి పనుల అనంతరం రహదారి మధ్యకు వచ్చాయి. దీంతో ట్రాక్టర్లు, ఆటోలు తిరగడానికి ఇబ్బందికరంగా మారింది. స్థానిక యువకులు విషయాన్ని సర్పంచ్ పుట్ల మోహనరావు దృష్టికి తీసుకు వెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన ఆదివారం స్తంభాలను తొలగింపజేశారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

నేడు ఆరు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు ప్రారంభం



గంపలగూడెం మండలం అనుముల్లంకలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు

గంపలగూడెం: మండలంలోని ఆరు గ్రామాల్లో రూ. 4.42 కోట్లతో నిర్మించిన 15 ప్రభుత్వ భవనాలను సోమవారం ప్రారంభిస్తారని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని) ఆయా గ్రామాల్లో నిర్మించిన 15 ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు. గంపలగూడెం-2, అనుముల్లంక, కొణిజెర్ల సచివాలయాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను, చింతలనర్వలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, మేడూరులో హెల్త్ సెంటర్, ఆర్బీకే, దుందిరాలపాడులో హెల్త్ సెంటర్, సచివాలయ భవనాలను ప్రారంభిస్తారన్నారు. ఊటుకూరు, గాదెవారిగూడెం గ్రామాల్లో రూ. 35 లక్షలతో నిర్మించిన 12 సిమెంట్ రోడ్లను, పీఎంజీఎస్‌వై నిధులు రూ. 4.58 కోట్లతో అమ్మిరెడ్డిగూడెం నుంచి వావిలాల వయా పెద్దకొమిర, మేడూరు, సొబ్బాల బీటీరోడ్డు ప్రారంభిస్తారన్నారు. కొణిజెర్లలో నెలకొల్పిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. పెనుగొలనులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ఎంపీ ప్రారంభిస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు.

వేగంగా వెల్వడం శివాలయం రోడ్డు అభివృద్ధి పనులు

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడంలోని పురాతన బాలకోటేశ్వరస్వామి దేవాలయం రహదారి అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రహదారి మట్టి రోడ్డు కావడంతో ఆలయానికి చేరుకునేందుకు భక్తులు ఇబ్బందులు పడేవారు. వెల్వడం శివాలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఎడ్ల బండ్లు కట్టుకుని వచ్చి స్వామివార్లకు మొక్కులు చెల్లించుకునేవారు. ప్రతి సంవత్సరం ప్రవాసాంధ్రులు శివరాత్రికి వారి స్వగ్రామం వెల్వడం చేరుకుని అందరూ కలిసి పెద్ద పండుగలా ఉత్సవం నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం వెల్వడం ప్రధాన రహదారి నుంచి శివాలయం వరకు ప్రవాసాంధ్రుల సౌజన్యంతో రూ. 50 లక్షలు అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. గ్రామానికి చెందిన కుడుముల కోటిరెడ్డి దంపతులు, మైలవరానికి చెందిన బయన శ్రీనివాసరావుల ఆర్థిక సహాయంతో చేపట్టిన ఈ పనులను ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రారంభించారు.

నేటినుంచి కల్యాణోత్సవాలు



నందిగామ: స్థానిక మెయిన్‌రోడ్డులోని రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి.పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్యం విశేష పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. ఈనెల 22వ తేదీ రాత్రి సుఖ శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణం జరగనుంది. 23వతేదీ సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి ఏటా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తూ ఉంటారు. తిరునాళ్ల మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



రెడ్డిగూడెం: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ కిషోర్‌బాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, యూనిఫాం ధరించాలని, అధికవేగంతో వెళ్లరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తం..

కుంభాభిషేకం





ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని, దేవస్థానం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించింది. నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ తాపడ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలను జరిపారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కేఎస్ రామారావు, ఎమ్మెల్యే విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





